మొక్కజొన్న సాగుకు ఇదే అదును

- నల్ల రేగడి, ఎర్ర నేలలు అనుకూలం
- యాజమాన్య పద్ధతులు పాటిస్తే మేలు
- ఏటా పెరుగుతున్న సాగు విస్తీర్ణం
- కాశినాయన ఏఓ జాకీర్ షరీఫ్





మండల వ్యవసాయాధికారి జాకీర్ షరీఫ్, కాశినాయన మండలం

కలసపాడు : మొక్కజొన్న ఆహార పంటగానే కాకుండా దాణారూపంలోనూ, పశువుల మేతగానూ, వివిధ పరిశ్రమల్లో ముడి సరుకుగా ఉపయోగిస్తారు. ఇటీవల కాలంలో మొక్కజొన్న సాగుపై కర్షకులు మక్కువ పెంచుకుంటున్నారు. తక్కువ సమయంలో పంట చేతికి రావడం.. మార్కెట్‌లో గిట్టుబాటు ధర పలుకుతుండటంతో మొక్కసాగుకు రైతులు ఆసక్తి చూపుతున్నారు. మొక్క జొన్న సాగుకు అనువైన సమయం ఇదే అని వ్యవసాయాధికారులు చెబుతున్నారు. చాలా మంది రైతులు ప్రస్తుతం ఈ పంట సాగులో బిజీగా ఉన్నారు. సరైన యాజమాన్య పద్ధతులు అవలంభిస్తే మంచి లాభాలు పొందవచ్చునని మండల వ్యవసాయాధికారి జాకీర్ షరీఫ్ సూచిస్తున్నారు. కలసపాడు మండలంలోని ఈ ఖరీఫ్ సీజన్‌లో దాదాపు 20వేల ఎకరాల్లో పత్తి, మొక్కజొన్న, కూరగాయలు తదితర పంటలు సాగు కానున్నాయి. అందులో మొక్క జొన్న సాగు విస్తీర్ణం పెరగనుందని అధికారులు తెలుపుతున్నారు. గత ఏడాది మండలంలో 800 ఎకరాల్లో మొక్కజొన్న పంట సాగైంది. ఈ సారి మాత్రం దాదాపుగా 1,500 ఎకరాల్లో సాగు పెరగనుందని అంచనా. మొక్క జొన్న సాగులో పాటించాల్సిన పద్ధతులు, జాగ్రత్తలపై అధికారులు పలు సలహాలు, సూచనలు ఇచ్చారు.

నేలలు

సారవంతమైన నీరు ఇంకే నల్లరేగడి నేలలు, ఎర్ర నేలలు, ఒండ్రు కలిగిన ఇసుక నేలలు మొక్క జొన్న సాగుకు అనుకూలమైనవి. చౌడు భూములు, నీరు నిల్వ ఉండేవి ఈ పంటకు అనుకూలించవు. విత్తుటకు ముందు మూడు నాలుగు సార్లు నాగలితో దుక్కిదున్నాలి. ఎకరాకు దాదాపు పది టన్నుల బాగా మాగిన పశువుల ఎరువును ఆఖరి దుక్కిలో వేసి కలియదున్నాలి.

విత్తే కాలం.. పద్ధతి

సాధారణ పరిస్థితుల్లో వర్షాధారపు పంటను జూన్ 15 నుంచి జూలై 15వ తేదీ వరకు విత్తుకోవచ్చు. రబీలో అక్టోబర్ 15 నుంచి నవంబర్ 15లోగా మొక్క జొన్న విత్తితే ఎక్కువ దిగుబడులు పొందడానికి అవకాశం ఉంది. ముందుగా నాగలితో బోదెలు చేసుకోవాలి. తర్వాత విత్తనాన్ని బోదెకు పైనుంచి 1-3 ఎత్తు నుంచి విత్తితే నీటి పారుదల సులభంగా ఉండటమేకాకుండా వర్షపాతం ఎక్కువైనప్పుడు నీరు బయటకు పోవడానికి వీలుంటుంది.

కలుపు నివారణ ఇలా..

పంట విత్తిన తర్వాత రెండు రోజులలోపు అట్రాజెన్ కలుపు మందును నేలరకాన్ని బట్టి 800-1200గ్రాములు ఎకరా నికి 200లీటర్ల నీటిలో కలిపి పిచికారీ చేసుకోవాలి. విత్తనం నాటిన 30రోజుల తర్వాత 2-4-డి సోడియం సాల్ట్ 0.5 కిలో లు ఎకరానికి 200 లీటర్ల నీటిలో కలిపి పిచికారీ చేయాలి. విత్తనం నాటిన 30 నుంచి 45 రోజులకు కల్టివేటర్‌తో అంతర కృషిచేస్తే కలుపు మొక్కలను నివారించవచ్చు.

నీటి తడులు

మొక్క జొన్న పూతకు ముందు, పూత దశలో, గింజ పాలుపోసుకునే దశలో బాగా నీరు పెట్టడం అవసరం. 30-40 రోజుల లోపు ఉన్న లేత పైరుకు అధిక నీరు హానికరం. విత్తిన తర్వాత పొలంలో నీరు నిలిస్తే విత్తనం మొలకెత్తదు. సాధారణంగా పంట కాలంలో 6-8 నీటి తడులు అవసరం. విత్తనాలు వేసినప్పుడు విత్తిన 15 రోజులకు తదితర దశల్లో నీటి తడులను తప్పకుండా ఇచ్చేలా జాగ్రత్త పడాలి. దీర్ఘకాలిక వంగడాలను ఒకటి, రెండు తడులు అధికంగా అవసరం అవుతాయి.

కాండం తొలుచు పురుగులు

కాండం తొలుచు పురుగులు రెండు రకాలు. మచ్చల, చారల కాండం తొలిచే పురుగు ఎక్కువగా ఖరీఫ్ పైరును ఆశిస్తుంది. గులాబి రంగు కాండం తొలుచు పురుగు ఎక్కువగా రబీలో ప్రభావం చూపుతుంది. ఇవి పైరు మొలకెత్తిన 10-20 రోజులకు సోకుతాయి. పిల్ల పురుగులు మొదట ఆకుల పైన పత్రహరితాన్ని గోకి తింటాయి. తర్వాత గుండు సూది మాదిర రంధ్రాలు, పొడవాటి చిల్లులు వరుస క్రమంలో కనిపిస్తాయి. లార్వాలు ఎదిగే అంకురాన్ని తినడం వల్ల పువ్వు చనిపోయి ఎండిపోతుంది. దీనినే డెడ్‌హార్ట్ అంటారు. కాండం లోపల గుండ్రని లేదా 'ఎస్' ఆకారంలో సొరంగాలను ఏర్పరుస్తుంది. ఇది పూతను, కంకిని ఆసించడంతో దిగుబడి తగ్గుతుంది.

రసం పీల్చు పురుగులు

30 రోజులు పైబడిన పైరుకు పేను బంక, నల్లి పురుగు ఆశించవచ్చు. పొడి వాతావరణంలో నీటి ఉధృతి ఎక్కువగా ఉంటుంది. లేత కాండం నుంచి రసాన్ని పీల్చడంతో ఆకులు పసుపు రంగుకు మారిపోతాయి. మొక్క సన్నగిల్లిపోతుంది. ఇవి విసర్జించే జిగురు పదార్థానికి చీమలు చేరడమే కాకుండా శిలీంద్రాలు ఏర్పడి మసి తెగులు ఆసించడం వల్ల కిరణ జన్య సంయోగ క్రియకు అంతరాయం ఏర్పడి దిగుబడి తగ్గుతుంది.

నివారణ

సహజంగా అక్షింతల పురుగులు సిర్ఫిట్స్ వంటి పరాన్న జీవులు ఈ పురుగులను అదుపులో ఉంచుతాయి. రసం పీల్చు పురుగుల ఉధృతి ఎక్కువగా ఉంటే మోనోక్రోటోఫాస్ ఎకరాకు 320 మిల్లీలీటర్లు లేదా డైమిటోయేట్ కలిపి పిచికారి చేయాలి.

తుప్పు తెగులు

ఆకులపై రెండు వైపులా గుండ్రని లేక పొడవాటి గోధుమ వర్ణపు పొక్కుల మాదిరిగా తెగులు లక్షణాలు కనిపిస్తాయి. పంట పెరిగినకొద్దీ ఆకులపై పొక్కులు గోధుమ వర్ణం నుంచి నలుపు వర్ణానికి మారుతాయి. ఉధృతి వ్యాప్తి ఎక్కువగా ఉంటుంది. ఈ తెగులు నివారణకు మ్యాంకోజెబ్ ఎకరానికి 500 గ్రాములు 200 లీటర్ల నీటిలో కలిపి తెగులు తీవ్రతను బట్టి ఒకటి లేక రెండు సార్లు పిచికారి చేయాలి.

నేలకొరిగిన పంటల పరిశీలన



అరటి పంటను పరిశీలిస్తున్న హెచ్‌ఓ మల్లేశ్వర్‌రెడ్డి

సింహాద్రిపురం : సింహాద్రిపురంతోపాటు గురిజాల, హిమకుంట్ల, లోమడ తదితర గ్రామాలలో ఆదివారం వీచిన ఈదురు గాలుల దాటికి భారీగా అరటి చెట్లు నేలకొరిగాయి. సోమవారం ముద్దనూరు హెచ్‌ఓ మల్లేశ్వర్ రెడ్డి, ఏఓ శివమోహన్‌రెడ్డిలు దెబ్బతిన్న అరటి పంటలను పరిశీలించారు. సింహాద్రిపురంలో 18హెక్టార్లు, హిమకుంట్లలో 14, గురిజాలలో 12హెక్టార్లు, మొత్తమ్మీద 44హెక్టార్లలో అరటి పంట దెబ్బతిందన్నారు. ఈ నివేదికలను ఉన్నతాధికారులకు పంపిస్తామని అధికారులు రైతులకు తెలిపారు. అరటి పంట నష్టపోయిన రైతులకు నష్టపరిహారం అందించాలని బాధిత రైతులు ప్రభుత్వానికి విన్నవిస్తున్నారు.

ఫీజుల దోపిడీని అరికట్టండి

కడప ఎడ్యుకేషన్: జిల్లావ్యాప్తంగా అధిక ఫీజులు వసూలు చేస్తున్న ప్రైవేట్ కార్పొరేట్ విద్యాసంస్థలపై చర్యలు తీసుకోవాలని రెవల్యూషనరీ స్టూడెంట్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి చెన్నకేశవరెడ్డి కోరారు. ఈ విషయమై సోమవారం డీఈఓ షేక్ షంషుద్దీన్‌కు ఆర్‌ఎస్‌యు ఆధ్వర్యంలో వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ నిబంధనలు ఉల్లంఘిస్తూ జిల్లాలో ప్రైవేట్ కార్పొరేట్ విద్యా సంస్థలు విద్యార్థులను, తల్లిదండ్రులను మోసం చేస్తూ లక్షల రూపాయలు ఫీజులు వసూలు చేస్తున్నాయన్నారు.

క్లుప్తంగా

అన్నదానం



భోజనం వడ్డిస్తున్న శివోహం అన్నప్రసాద సేవా సంఘం సభ్యులు

ప్రొద్దుటూరు : స్థానిక అగస్త్యేశ్వరస్వామి ఆలయంలో సోమవారం శివోహం అన్న ప్రసాద సేవా సంఘం ఆధ్వర్యంలో అన్నప్రసాద వితరణ కార్యక్రమాన్ని నిర్వహించారు. హైదరాబాద్‌కు చెందిన డాక్టర్ ఓబుళరెడ్డి అనిల్ కుమార్ రెడ్డి, డాక్టర్ హరిత, వారి పిల్లలు వినూత్న, ప్రణవ్ కుటుంబ సభ్యుల సహకారంతో ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో సుమారు 600 మంది అన్న ప్రసాదం స్వీకరించారు. ఈ కార్యక్రమంలో శెట్టిపల్లె కవిత, ఓబుళరెడ్డి వినూత్న, శివోహం అన్న ప్రసాద సేవా సంం సభ్యులు మురుకూటి సూర్యనారాయణరెడ్డి, విష్ణు నారాయణ, కల్లూరు ప్రభాకర్‌రెడ్డి, లింగారెడ్డి, రాయపురెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్య పరీక్షలు తప్పనిసరి



గర్భిణులకు సూచనలు ఇస్తున్న డాక్టర్ ఉదయ్‌కిరణ్

బి.కోడూరు : మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో సోమవారం డాక్టర్ ఉదయ కిరణ్ ఆధ్వర్యంలో ప్రధానమంత్రి సురక్షిత్ మాతృత్వ అభియాన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కార్యక్రమంలో గర్భిణీలు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, తదితర అంశాలపై మహిళలకు వివరించారు. అలాగే ప్రతి గర్భిణీకి వైద్య పరీక్షలు ఉచితంగా నిర్వహిస్తామని, ప్రమాదకర లక్షణాలు ఉన్న వారిని గుర్తించి వారి కాన్పు హాస్పిటల్‌లో జరిగేలా చూడాలని దీని వలన తల్లి బిడ్డ సురక్షితంగా ఉండే అవకాశం ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో సీహెచ్‌ఓ పుష్పాంజలి, సూపర్‌వైజర్లు జాన్ విలియం, విజయలక్ష్మీ, ల్యాబ్ టెక్నీషియన్లు, ఏ.ఎస్.ఎంలు తదితరులు పాల్గొన్నారు.

కాలువల్లో పూడికతీత పనులు



పూడికతీత పనులను పర్యవేక్షిస్తున్న మున్సిపల్ కమిషనర్ మల్లికార్జున

ప్రొద్దుటూరు : పట్టణంలోని ప్రధాన మురికి కాలువల్లో రాబోవు వర్షాకాలాన్ని దృష్టిలో పెట్టుకుని మున్సిపల్ అధికారులు పూడికతీత పనులు చేపట్టారు. ప్రధాన కాలువ అయిన మడూరు కాలువలో జేసీబీతో సిబ్బంది పూడికను తొలగిస్తున్నారు. శ్రీనివాసనగర్ డిపో వద్ద ఉన్న కాలువలో పూడికతీత పనులను సోమవారం మున్సిపల్ కమిషనర్ మల్లికార్జున పర్యవేక్షించారు. ప్రజలు ఇబ్బంది లేకుండా పూడికతీత పనులను త్వరగా చేయాలని సిబ్బందికి సూచించారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ ఇంజినీర్ జి.వినోద్‌కుమార్‌రెడ్డి పాల్గొన్నారు.

ఘన నివాళి



మృతదేహం వద్ద నివాళి అర్పిస్తున్న ఎమ్మెల్సీ

పోరుమామిళ్ల : వెంకటాపురం బీట్ ఆఫీసర్‌గా పని చేస్తూ, ఆదివారం బైకులో బద్వేలు వెళుతూ గుండెపోటుతో మృతి చెందిన రామాంజనేయులు మృతదేహం వద్ద పూల మాల వేసి ఎమ్మెల్సీ డీసీ గోవిందరెడ్డి నివాళి తెలిపారు. సోమవారం ఉదయం వారింటికి వెళ్లి కుటుంబసభ్యులను పరామర్శించారు. అధైర్య పడవద్దని ఓదార్చారు. ఆయన వెంట వైస్ ఎంపీపీ బాషా, జిల్లా ప్రచార విభాగం అధ్యక్షులు రాజీవ్‌బాషా, జిల్లా ఆర్గనైజేషనల్ సెక్రటరి రాళ్లపల్లె నరసింహులు, ఎంపీటీసీ ఇస్మాక్, విద్యార్థి విభాగం జిల్లా ఉపాధ్యక్షులు సాయినారాయణరెడ్డి, మైనారిటి సెల్ అధ్యక్షులు మస్తాన్ తదితరులు పాల్గొన్నారు.

పరామర్శ

బి.కోడూరు : మండలంలోని గుంతపల్లె గ్రామానికి చెందిన జడ్పీటీసీ సంగటి దావీదు కుమారుడు సురేంద్ర కాన్సర్‌తో బాధపడుతూ కడప రిమ్స్ హాస్పిటల్‌లో చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందారు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్సీ డీసీ గోవిందరెడ్డి, ఎమ్మెల్యే డాక్టర్ సుధ, బద్వేలు నియోజకవర్గ వైఎస్సార్ సీపీ అదనపు సమన్వయకర్త నల్లేరు విశ్వనాధ రెడ్డి, బద్వేలు నియోజకవర్గ బూత్ కన్వీనర్ల సమన్వయ కర్త కె. రమణారెడ్డి తదితరులు దావీదు ఇంటికి వెళ్లి ప్రగాఢ సానుభూతి తెలిపారు. వీరి వెంట మండల వైఎస్సార్ సీపీ అధ్యక్షులు యస్.రామకృష్ణారెడ్డి, సర్పంచ్ మునిరెడ్డి, మాజీ సర్పంచ్ లక్ష్మీనరసారెడ్డి, దుగ్గిరెడ్డి, చాపాటి సాయినారాయణరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థుల సమస్యలు వెంటనే పరిష్కరించాలి



తహసీల్దార్ గంగయ్యకు వినతి పత్రం అందిస్తున్న ఎంపీజే నాయకులు

ప్రొద్దుటూరు రూరల్ : రాష్ట్రంలోని విద్యార్థుల సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని ఎంపీజే పట్టణాధ్యక్షుడు ఎ.హుస్సేన్‌బాషా కోరారు. సోమవారం స్థానిక తహసీల్దార్ గంగయ్యకు ఎంపీజే నాయకులు వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 1-12వ తరగతి వారికి రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చే తల్లికి వందనం వెంటనే ఇవ్వాలన్నారు. బీటెక్, ఇతర విద్యావంతులకు ఇవ్వాల్సిన ఫీజు రీయింబర్స్ గత ఏడాది, ఈ ఏడాది బకాయిలను వెంటనే మంజూరు చేయాలన్నారు. రాష్ట్రంలో విద్యాహక్కు చట్టం ఎక్కడా అమలు కావడం లేదన్నారు. కేంద్ర ప్రభుత్వం రద్దు చేసిన మైనారిటీ స్కాలర్‌షిప్‌లను మళ్లీ పునఃప్రారంభించేలా కేంద్రప్రభుత్వంపై రాష్ట్ర ప్రభుత్వం ఒత్తిడి తేవాలన్నారు. అంగన్‌వాడీ, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ హాస్టళ్లల్లో ఉన్న సమస్యలను వెంటనే పరిష్కరించాలన్నారు. డ్రాప్ అవుట్ విద్యార్థులను గురించి ఆ విద్యార్థులను పాఠశాలల్లో చేర్పించేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఇప్పుడు భర్తీ చేయనున్న 16వేల ఉపాధ్యాయ పోస్టులనే కాకుండా ఖాళీగా ఉన్న మరో 30 వేల పోస్టులను భర్తీ చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎంపీజే నాయకులు ముక్తియార్ తదితరులు పాల్గొన్నారు.

పౌష్టికాహారంతోనే తల్లీబిడ్డ క్షేమం



గర్భిణులకు వైద్య పరీక్షలు చేస్తున్న డాక్టర్ రోషిణి

దువ్వూరు : పౌష్టికాహారంతోనే తల్లీబిడ్డ క్షేమంగా ఉంటారని దువ్వూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం డాక్టర్ సురేష్‌బాబు పేర్కొన్నారు. సోమవారం దువ్వూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ప్రధాన మంత్రి సురక్షిత మాతృత్వ అభియాన్ కార్యక్రమం నిర్వహించారు. వైద్యులు సురేష్‌బాబు, రోషిణి, హేమలత, వికసిత గర్భిణులకు వైద్య పరీక్షలు చేసి మందులు అందజేసి, పలు సలహాలు, సూచనలు ఇచ్చారు. 37 మంది గర్భిణులకు రక్త పరీక్షలు, స్కానింగ్, థైరాయిడ్, బీపీ తదితర పరీక్షలు చేశారు. 17 మంది గర్భిణులు హై రిస్క్‌లో ఉన్నట్లు గుర్తించి, సరైన వైద్య సేవలు, సమయానికి మందులు, పౌష్టికాహారం తీసుకోవాలని సూచించారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో ఇచ్చే చిక్కీలు, గుడ్లు, రాగి పిండితో తయారు చేసిన పదార్థాలు, ఆకుకూరలు ప్రతి రోజు ఆహారంలో ఉండే విధంగా గర్భిణులు చూసుకోవాలన్నారు. ప్రతి గర్భిణి ప్రభుత్వ ఆస్పత్రుల్లో ప్రసవాలు చేయించుకోవాలని, ప్రభుత్వం అందించే జనని సురక్ష, ప్రధాన మంత్రి మాతృత్వ వందన యోజన పథకాలను పొందాలని డాక్టర్లు కోరారు. కార్యక్రమంలో హెల్త్ సూపర్‌వైజర్‌లు రాజగోపాల్, సువర్ణ, ఆప్తమాలిక్ ఆఫీసర్ చంద్రమౌళి, ఏఎన్ఎంలు, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

సమస్యలపై దృష్టి సారించండి



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీడీఓ మైథిలి

కాశినాయన : అధికారులు, ప్రజా ప్రతినిధులు సమస్యలపై దృష్టి సారించాలని ఎంపీపీ నల్లేరు పోలమ్మ తెలిపారు. నరసాపురంలోని స్త్రీశక్తి భవనంలో మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీపీ పోలమ్మ, ఎంపీడీఓ మైథిలి మాట్లాడుతూ అధికారులు గ్రామాల్లోకి వెళ్లి ప్రజా సమస్యలను తెలుసుకుని పరిష్కరించే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. మూడు నెలలకోసారి జరిగే మండల సర్వసభ్య సమావేశానికి కొంత మంది అధికారులు డుమ్మా కొడుతున్నారని, వీరిపై జిల్లా అధికారులకు తెలియజేస్తామన్నారు. మండల స్థాయి అధికారులు ప్రభుత్వం నుండి కొత్తగా మార్గదర్శకాలు వస్తుంటాయని, ఆ మార్గదర్శకాలను తమ దృష్టికి తీసుకురావాలని తెలిపారు. అనంతరం మండల స్థాయి అధికారులు వారి వారి శాఖలపై నివేదికలను చదివి వినిపించారు. ఈ కార్యక్రమంలో మండల పరిషత్ ఉపాధ్యక్షులు వెంకటసుబ్బయ్య ఆచారి, భాస్కర్‌రెడ్డి, ఈఓపీఆర్డీ ముజఫర్ రహీం, ఆర్‌డబ్ల్యూఎస్, పీఆర్ ఏఈలు ఓబయ్య, పుల్లయ్య, ఎంఈఓ నిర్మల, హెచ్‌ఓ శ్రీనివాసులరెడ్డి, ఏఓ జయలక్ష్మి, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ చంద్రకళ, మండల స్థాయి అధికారులు, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

త్రైత సిద్ధాంత జ్ఞానంపై అవగాహన

బద్వేలు అర్బన్ : ప్రతి ఒక్కరు కర్మయోగ విశిష్టత, త్రైత సిద్ధాంత జ్ఞానంపై అవగాహన కలిగి ఉండాలని త్రైత సిద్ధాంత ప్రబోధ సేవా సమితి గిద్దలూరు కమిటీ అధ్యక్షులు శివకుమార్ పేర్కొన్నారు. త్రైత సిద్ధాంత భగవద్గీత ప్రచారంలో భాగంగా సోమవారం పట్టణంలోని నెల్లూరు రోడ్డులో ప్రచార కార్యక్రమాలు నిర్వహించి పలువురికి భగవద్గీత పుస్తకాలు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆదిగురువుగా శ్రీకృష్ణుని జీవన విధానం లోకానికి ఒక ప్రామాణికమని అన్నారు. ధర్మం విలువ తెలుపుటకు, ధర్మం పక్షాన నిలబడేందుకు వయోపరిమితి అడ్డు కాదని చాటిన ధర్మశీలి శ్రీకృష్ణుడు అని అన్నారు. కార్యక్రమంలో త్రైత సిద్ధాంత ప్రబోధ సేవాసమితి సభ్యులు లీలా నారాయణ, భాగ్యం, ఖాదర్, పుల్లమ్మ, పార్వతి, లక్ష్మీదేవి, సుభాషిణి తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు ప్రతిభా అవార్డులు



విద్యార్థులతో జిల్లా కలెక్టర్ చెరుకూరి శ్రీధర్, ఎమ్మెల్సీ రాంగోపాల్ రెడ్డి

ప్రొద్దుటూరు కల్చరల్ : స్థానిక సూపర్ బజార్ రోడ్డులోని శ్రీవిద్య జూనియర్ కళాశాలలో చదివిన ఇద్దరు విద్యార్థినులు సోమవారం కడప మాధవి కన్వెన్షన్‌లో జరిగిన కార్యక్రమంలో ప్రతిభా అవార్డులు అందుకున్నారు. ఎంపీసీ విభాగంలో వి.గీతాంజలి 991/1000, బైపీసీ విభాగంలో ఎస్. సఫియా 990/1000 మార్కులు సాధించారు. ఈ విద్యార్థినులకు కలెక్టర్ చెరుకూరి శ్రీధర్, ఎమ్మెల్సీ రాంగోపాల్ రెడ్డి, ఆర్‌ఐఓ వెంకటసుబ్బయ్య గోల్డ్ మెడల్, సర్టిఫికెట్, రూ.20వేలు నగదు బహుమతి అందజేశారు. విద్యార్థినులను కళాశాల ప్రిన్సిపాల్ రమణరావు, డైరెక్టర్లు శ్రీకాంత్‌రెడ్డి, రామ్మోహన్, దస్తగిరి, అధ్యాపకులు అభినందించారు.

అక్రమ అడ్మిషన్లపై చర్యలేవీ..?

పోరుమామిళ్ల: పోరుమామిళ్లలో ప్రైవేట్, కార్పొరేట్ విద్యాసంస్థలు ప్రభుత్వ నిబంధనలు పాటించడం లేదని ఏఐఎస్‌యు జిల్లా అధ్యక్షుడు దానకి షోర్ ఆరోపించారు. సోమవారం ఆయన మాట్లాడుతూ ముందస్తు అక్రమ అడ్మిషన్లు చేస్తూ తరగతులు నిర్వహిస్తున్న సంస్థలపై చర్యలు తీసుకోవాలన్నారు. ఈ-టెక్నో, ఒలంపియాడ్, కాన్సెప్ట్, ఐఐటి, సైనిక్ వంటి పేర్లతో ప్రచారాలు చేస్తూ వేల రూపాయలు ఫీజులు వసూలు చేస్తున్నా ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదన్నారు. ఎల్‌కేజీ పాఠ్య పుస్తకాలకు రూ. 4 వేల నుండి రూ. 10 వేలు వసూలు చేస్తున్నారని, అడ్మిషన్ ఫీజు పేరుతో రూ. 3500 నుండి రూ. 5 వేలు వసూలు చేస్తున్నారన్నారు. విద్యాశాఖ అధికారులు ఈ విద్యాసంస్థలపై ఎందుకు చర్యలు తీసుకోవడం లేదన్నారు. ఈ కార్యక్రమంలో ఏఐఎస్‌యు నాయకులు అశోక్, రమణారెడ్డి పాల్గొన్నారు.

నూతన సాంకేతికతతో అధిక దిగుబడి

వల్లూరు : రైతులు నూతన సాంకేతికతను అందిపుచ్చుకోవడం వలన వ్యవసాయంలో మంచి ఫలితాలను సాధించడానికి అవకాశాలు వున్నాయని భారత నూనె గింజల పరిశోధన సంస్థ ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ కదిరీ వేల్ అన్నారు. ఊటుకూ కృషి విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యంలో మండల పరిధిలోని తప్పెట్ల, పెద్ద లేబాక గ్రామాలలో సోమవారం వికసిత కృషి సంకల్ప అభియాన్ కార్యక్రమంలో భాగంగా రైతులకు అవగాహనా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు శాస్త్రవేత్తలతో ప్రత్యక్షంగా మాట్లాడడానికి అవకాశం కల్పించడంతో బాటు, ఖరీఫ్ పంట కాలంలో అవసరమైన సలహాలు, సూచనలు ఇవ్వడానికి 700 జిల్లాలలో శాస్త్రవేత్తల బృందాల భాగస్వామ్యంతో నూతన సాంకేతికతను అందించడం, ప్రభుత్వ పథకాలపై సమాచారం అందించడం కోసం ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కృషి విజ్ఞాన కేంద్రం సమన్వయకర్త డాక్టర్ ఏ వీరయ్య వరిలో నారు నుంచి కోత దాకా రైతులు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, సూచనలను వివరించారు. సేంద్రియ ఎరువుల గురించి వివరించారు. శాస్త్రవేత్త డాక్టర్ కే సాయి మహేశ్వరి మిముము,నువ్వుల పంటలలో మేలైన రకాల గురించి, ఎరువులు యాజమాన్యం మరియు సమగ్ర యాజమాన్య పద్ధతుల గురించి వివరించారు. ఏవో సాయి జ్యోతి ప్రస్తుత వ్యవసాయ రంగంలో ఉన్న కేంద్ర మరియు రాష్ట్ర ప్రభుత్వ పథకాల గురించి, పీఎం కిసాన్ అన్నదాత సుఖీభవ, రైతు నమోదు, కిసాన్ డ్రోన్ పథకాల గురించి తెలిపారు.

ఘనంగా ఎస్టీయూ ఆవిర్భావ దినోత్సవం



ఎస్టీయూ భవన్ వద్ద జండా ఎగురవేస్తున్న నాయకులు

పోరుమామిళ్ల : ఉపాధ్యాయ, విద్యారంగ సంక్షేమం కోసం ఎన్నో ఉద్యమాలకు సారథ్యం వహించిన చరిత్ర ఎస్టీయు సొంతమని ఎస్టీయు రాష్ట్ర అదనపు ప్రధాన కార్యదర్శి రమణారెడ్డి, సీపీయస్ కన్వీనర్ సుబ్రమణ్యం పేర్కొన్నారు. సోమవారం ఎస్టీయు భవన్‌లో సంస్థ 79 వ ఆవిర్భావ వేడుకలు ఘనంగా నిర్వహించారు. జండా ఆవిష్కరణ అనంతరం ఉపాధ్యాయ ఉద్యమ పితామహులు వీణా విజయరామ రాజు, మగ్దూం మొహియుద్దీన్ చిత్రపటాలకు పూలమాల వేసి నివాళి అర్పించారు. ఈ కార్యక్రమంలో నాయకులు బాలరాజు, చంద్రోశేఖర్, నారాయణరెడ్డి, రామకృష్ణారెడ్డి, గురయ్య, శ్రీనివాసులు, రవీంద్రబాబు, తదితరులు పాల్గొన్నారు.

మేలైన విత్తనాలను ఎంపిక చేసుకోవాలి



మాట్లాడుతున్న కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్త డాక్టర్ బాలకృష్ణ

మైదుకూరు : పంటల సాగులో రైతులు మేలైనే విత్తనాలను ఎంపిక చేసుకోవాలని శాస్త్రవేత్తలు, వ్యవసాయాధికారులు సూచించారు. కేంద్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న వికసిత కృషి సంకల్ప అభియాన్ కార్యక్రమాలను సోమవారం ఎర్రగుంట్ల మండలంలో నిర్వహించారు. మైదుకూరు మండలం వనిపెంట కృషి విజ్ఞాన కేంద్రం అధిపతి, శాస్త్రవేత్త డాక్టర్ ఎం.బాలకృష్ణ అధ్యక్షతన మాలెపాడు, పోట్లదుర్తి, చిన్నదండ్లూరు, చిలంకూరు, నిడుజువ్వి, చిర్రాజుపల్లె, తిప్పలూరు, ఎర్రగుంట్ల, టి.సుంకేసుల గ్రామాల్లో మేలైన విత్తనాల ఎంపిక -అధిక దిగుబడులు అనే అంశంపై చర్చా కార్యక్రమాలను నిర్వహించారు. ఈ సందర్భంగా శాస్త్రవేత్తలు, వ్యవసాయాధికారులు మాట్లాడుతూ నాణ్యమైన విత్తనాలతో అధిక దిగుబడులు వస్తాయన్నారు. పంటల సాగుకు ముందు విత్తన శుద్ధి కూడా ముఖ్యమని తెలిపారు. జాతీయ చిరుధాన్యాల పరిశోధన సంస్థ ప్రధాన శాస్త్రవేత్తలు డాక్టర్ సుబ్బరాయుడు, డాక్టర్ శ్యాంప్రసాద్, డాక్టర్ ఉమాకాంత్ మాట్లాడుతూ చిరుధాన్యాల రకాలు, ప్రాధాన్యత, పోషకాలు, వాటి సాగులో యాజమాన్య పద్ధతుల గురించి వివరించారు. ఊటుకూరు వ్యవసాయ పరిశోధన సంస్థ ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ కె.సునీల్ కుమార్, పశువైద్యాధికారులు డాక్టర్ జ్యోత్స్న, మహేశ్వర్‌రెడ్డి, వ్యవసాయాధికారి శ్రీకాంత్ రెడ్డి, కేవీకే శాస్త్రవేత్త ఫిరోజ్ హుస్సేన్ తదితరులు పాల్గొన్నారు.

మానసిక ఒత్తిడికి గురి చేయకుండా బోధించాలి



విద్యా బోధనపై సూచనలు చేస్తున్న ప్రొఫెసర్ యోగమీన

చాపాడు : విద్యార్థులు మానసిక ఒత్తిడికి గురి కాకుండా అధ్యాపకులు బోధించాలని చెన్నైకి చెందిన ఎన్ఐటీటీఆర్ ఎడ్యుకేషన్ టెక్నాలజీ ప్రొఫెసర్ బి.యోగమీన పేర్కొన్నారు. స్థానిక చైతన్య భారతి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ(సీబీఐటీ)లో ఈ నెల 9 నుంచి 13వ తేదీ వరకు అధ్యాపకులకు ప్రొఫెషనల్ డెవలప్‌మెంట్ ప్రొగ్రాంపై అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా సోమవారం యోగమీన మాట్లాడుతూ ఉపాధ్యాయ నైపుణ్యాన్ని పెంపొందించే విధంగా ఆధునిక సాంకేతికతను, కమ్యునికేషన్ స్కిల్స్, ఎమోషనల్ లర్నింగ్ స్కిల్స్‌పై ప్రత్యేక దృష్టి కేంద్రీకరించాలన్నారు. విద్యార్థులకు మానసిక ఒత్తిడికి గురి కాకుండా విద్యా బోధన ఉండాలన్నారు. అనంతరం డిజిటల్ టెక్నిక్ అండ్ ఎమర్జింగ్ టెక్నాలజీపై అధ్యాపకులకు పలు రకాలైన విద్యా బోధన విధానాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఎన్ఐటీటీఆర్ డిపార్ట్‌మెంట్ ఆఫ్ ఎడ్యుకేషన్ మీడియా అండ్ టెక్నాలజీ అసోసియేట్ ప్రొఫెసర్ డా.సుభా, సీబీఐటీ అకడమిక్ డీన్ డా.జి. శ్రీనివాసులరెడ్డి, సీఈఓ వి.లోహిత్‌రెడ్డి, ప్రిన్సిపల్ డా.ఎస్.శృతి తదితరులు పాల్గొన్నారు.

యోగా సాధనతో మానసిక ప్రశాంతత



దువ్వూరు: యోగాంధ్ర ర్యాలీ నిర్వహిస్తున్న అధికారులు



కాశినాయన: ర్యాలీ నిర్వహిస్తున్న అధికారులు



ప్రొద్దుటూరు రూరల్ : మాట్లాడుతున్న డీఎల్‌డీఓ సుబ్రహ్మణ్యం

దువ్వూరు : నిత్యం యోగా సాధనతో మానసిక ప్రశాంతత చేకూరుతుందని ఇన్‌చార్జి ఎంపీడీఓ హరికృష్ణ పేర్కొన్నారు. సోమవారం యోగాంధ్ర కార్యక్రమంలో భాగంగా అధికారులు, సచివాలయ సిబ్బంది ఎంపీడీఓ కార్యాలయం నుంచి దువ్వూరు సెంటర్ వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతూ యోగా చేయడం ద్వారా శారీరక, మానసిక రుగ్మతల నుంచి విముక్తి లభిస్తుందన్నారు. యోగాపై ప్రజలందరూ అవగాహన పెంచుకోవాలని తెలిపారు. యోగాసనాలు వేయడం ద్వారా క్రమశిక్షణ, మెరుగైన జీవన విధానం అలవడుతుందన్నారు. యోగాంధ్ర ప్రచారంలో భాగంగా జూన్ 21వ తేదీ వరకు ఈ కార్యక్రమాలు నిర్వహిస్తామని తెలిపారు. కార్యక్రమంలో దువ్వూరు సర్పంచ్ చెంద్రాయుడు, యోగా ట్రైనర్ డాక్టర్ తిరుమల రావు, పంచాయతీ కార్యదర్శి సత్యనారాయణ, ఉపాధి హామీ ఏపీఓ లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

యోగాపై అవగాహన ర్యాలీ

కాశినాయన : యోగాంధ్ర కార్యక్రమంలో భాగంగా సోమవారం ఎంపీడీఓ మైథిలి ఆధ్వర్యంలో నరసాపురంలో ర్యాలీ నిర్వహించారు. ఎంపీడీఓ కార్యాలయం నుండి గ్రామంలోని ఆంజనేయ స్వామి ఆలయం వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీలో మండల స్థాయి అధికారులు, పంచాయతీ కార్యదర్శులు, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతూ యోగా వలన అనేక రకాల ఆరోగ్య ప్రయోజనాలు కలుగుతాయన్నారు. నిత్యం యోగం చేయడం వల్ల శారీరక, మానసిక ఆరోగ్యాన్ని మెరుగు పరుస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో ఈఓపీఆర్డీ ముజఫర్ రహీం తదితరులు పాల్గొన్నారు.

యోగాతో సంపూర్ణ ఆరోగ్యం

ప్రొద్దుటూరు రూరల్ : యోగాతో సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుందని డీఎల్‌డీఓ సుబ్రహ్మణ్యం పేర్కొన్నారు. మండలంలోని అన్ని గ్రామ పంచాయతీల పరిధిలో సోమవారం నిర్వహించిన యోగాంధ్ర ర్యాలీ కార్యక్రమాలను ఆయన పర్యవేక్షించారు. కొత్తపల్లె గ్రామ పంచాయతీ ఖాదరబాద్‌లో జరిగిన ర్యాలీలో ఆయన మాట్లాడుతూ ఈనెల 21న ప్రపంచ యోగా దినోత్సవం సందర్భంగా అన్ని గ్రామ పంచాయతీల్లో యోగా కార్యక్రమాల్లో ప్రజలు స్వచ్ఛంగా పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. యోగా వలన అనేక ఆరోగ్య ప్రయోజనాలు ఉన్నాయని తెలిపారు. ప్రతి ఒక్కరూ యోగాపై అవగాహన కలిగి ఉండి యోగాసనాలు వేసి ఆరోగ్యంగా ఉండాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ సూర్యనారాయణరెడ్డి, కార్యదర్శి రామ్మోహన్‌రెడ్డి, సర్పంచ్ కొనిరెడ్డి శివచంద్రారెడ్డి, ఎంపీటీసీ సభ్యులు, వార్డు సభ్యులు, వైద్య సిబ్బంది, సచివాలయ సిబ్బంది, ప్రజలు పాల్గొన్నారు.